సాక్షి నారాయణపేట

శుక్రవారం, 6, అక్టోబర్, 2023



నెరవేరిన ఉద్యోగ కల

పీయూ స్టడీ సర్కిల్‌లో చదివిన పలువురు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు.

వివరాలు 8లో ▸



ఈజీ మనీ కోసం చోరీలు

చోరీలు, హత్య, కిడ్నాప్ కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /22.6

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రమబద్ధీకరించకుంటే ఉద్యమం ఉధృతం



నారాయణపేట: 104 ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి వైద్యాధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రం సమర్పించినా సమస్యలను విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో నిరసనగా రిలే దీక్షలు చేపట్టామన్నారు. ఆరు నెలలుగా జీతాలు రావాలని, వెంటనే పెండింగ్ జీతాలను విడుదల చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రకాశ్‌గౌడ్, నాయకులు బాలగోపాల్, సత్యకుమార్, రవి, వసంత, అనిఫా, రాజులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామి ఆలయంలో వేలం పాట



చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు గురువారం ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల్లో తలనీలాలు, పూజ సామగ్రి విక్రయం, రంగుల రాట్నాలు ఏర్పాటు, తడకలు, వెదురు బొంగుల సప్లయ్‌కి గాను వేలం పాటలు నిర్వహించారు. ఇందులో పూజా సామగ్రి విక్రయాలకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలానికి చెందిన అరుణ్‌కుమార్ రూ.20.10 లక్షలకు దక్కించుకున్నాడు. తలనీలాలకు సరైన పాట రాక వాయిదా పడింది. రంగుల రాట్నం వ్యాపారులు లైసెన్స్ ఉన్నవారికి మాత్రమే వేలంలో అవకాశం కల్పించాలని అధికారులను కోరడంతో టెండర్‌దారుల మధ్య ఘర్షణ తలెత్తి వేలం పాట వాయిదా పడింది. తడకలు, వెదురు బొంగుల సప్లయ్‌కి టెండర్‌దారులు ఎవరూ రాకపోవడంతో అవి కూడా వాయిదా పడ్డాయి. దీంతో తలనీలాలు, రగుల రాట్నాలు, తడకలు, వెదురు బొంగుల సప్లయ్‌కి మరోసారి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది శ్రీకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో కుదుపు!

అచ్చంపేటలో అలజడి

- కాంగ్రెస్‌లో కీలక గులాబీ నాయకుల చేరిక
- మంత్రి కేటీఆర్ పర్యటనకు ముందు అనూహ్య పరిణామాలు
- త్వరలో ఓ ప్రజాప్రతినిధి అనుచరులు సైతం జంప్
- నియోజకవర్గ ముఖ్యనేతతో విభేదాలే కారణం
- చక్రం తిప్పిన రేవంత్‌రెడ్డి, కసిరెడ్డి.. హీటెక్కిన రాజకీయాలు
- కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అలంపూర్‌లో సైతం ఇలాంటి పరిస్థితులే..



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయాలు హీటెక్కాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి, కాంగ్రెస్ మధ్య వలసల పరంపర కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అసెంబ్లీ టికెట్లు ఖరారు కాగా.. వారు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను పండగలా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆయా మండలాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలను చేర్చుకుంటూ ఎన్నికల పోరుకు సన్నద్ధమవుతున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మహబూబ్‌నగర్, దేవరకద్ర, కొడంగల్, జడ్చర్ల, నారాయణపేట నియోజకవర్గాల్లో ఆయా నేతలు జోష్‌తో ముందుకు సాగుతున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్‌లో మాత్రం ఇందుకు భిన్నపరిస్థితులు ఉన్నాయి. అచ్చంపేటలో బీఆర్‌ఎస్‌కు చెందిన కీలక నాయకులు పలువురు గురువారం కాంగ్రెస్‌లో చేరడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణుల్లో అలజడి నెలకొనగా.. ఓ కుదుపుగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

కేటీఆర్ పర్యటనకు ముందు షాక్..

ఈ నెల 8వ తేదీన రాష్ట్ర పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అచ్చంపేటలో పర్యటించనున్నారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ కూడా ఖరారైంది. ఇంతలో నియోజకవర్గానికి చెందిన కీలక నాయకులు అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే వ్యవహార శైలి, విభేదాలతోనే..

అచ్చంపేట, ఉప్పునుంతల జెడ్పీటీసీ సభ్యులు మంత్రియ నాయక్, అనంత ప్రతాప్‌రెడ్డి, ఉప్పునుంతల ఎంపీపీ తిప్పర్తి అరుణ, ఆమె భర్త నర్సింహారెడ్డి, అచ్చంపేట వైస్ ఎంపీపీ చీమర్ల అమరావతి, ఆమె భర్త వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీఎంరెడ్డి, ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల తనయులు, తదితరులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు వెళ్లి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వ్యవహారశైలి, ఆయనతో నెలకొన్న విభేదాలతోనే వారు గులాబీని వీడి.. చేయి అందుకున్నట్లు తెలుస్తోంది.

పక్కా ప్రణాళికతో..

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్.. తొలి నుంచీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌పై కన్నేసింది. కొల్లాపూర్‌లో జూపల్లి, వనపర్తిలో మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, గద్వాలలో జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య చేరికలతో మొదలు కల్వకుర్తి, ఆ తర్వాత అచ్చంపేటపై నజర్ వేసినట్లు మారుతున్న రాజకీయ పరిణామాలను బట్టి రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. త్వరలో అలంపూర్‌పైనా ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, అచ్చంపేటలో వలసలకు సంబంధించి సామాజిక పరంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కసిరెడ్డి చక్రం తిప్పినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

త్వరలో ఎంపీ అనుచరులు సైతం..

అచ్చంపేట, బల్మూరుకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులతో పాటు పలువురు నాయకులు సైతం బీఆర్‌ఎస్ వీడనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరితో పాటు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరిన వారు కొన్నాళ్లుగా ఎమ్మెల్యేతో దూరంగా ఉన్నట్లు తెలిసింది. 'అచ్చంపేట నుంచి టికెట్ తెచ్చుకోండి.. సహకరిస్తాం' అని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఆయన కుమారుడు జెడ్పీటీసీ సభ్యుడు భరత్ ప్రసాద్‌కు వారు గతంలోనే సూచించినట్లు ప్రజల్లో టాక్ ఉంది. అయితే గువ్వల బాలరాజుకే మళ్లీ టికెట్ ఖరారు కాగా, మార్పు జరుగుతుందని ఆశించి ఇన్నాళ్లు బీఆర్‌ఎస్‌లో స్తబ్దుగా ఉన్న వారు.. ఇక లాభం లేదనుకుని మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరినట్లు సమాచారం. ఎంపీ రాములు వర్గంగా ముద్రపడి ప్రాధాన్యం దక్కని నాయకులు సైతం త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు గుసగుసలు విన్పిస్తున్నాయి.

కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అలంపూర్‌లో సైతం..

బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీలు కలిసిరాని పరిస్థితులు పాలమూరులో నెలకొన్నాయి. ఇందుకు కసిరెడ్డి, కూచుకుళ్ల, చల్లా ఉదంతాలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తదితరులు ఇప్పటికే బీఆర్‌ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కసిరెడ్డికి కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఖరారైనట్లు సైతం ప్రచారం జరుగుతోంది. నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఇంకా బీఆర్‌ఎస్‌లోని ఉన్నప్పటికీ.. ఆయన కుమారుడు రాజేష్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో రేపో, మాపో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ ఎత్తున వలసలు ఉంటాయని తెలుస్తోంది. మరోవైపు అలంపూర్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే అబ్రహంకు పొసగడం లేదు. విభేదాలపై ఇప్పటివరకు చల్లా స్పందించలేదు. కానీ నియోజకవర్గంలో పలు మండలాల్లో అసంతృప్త నాయకుల వెనుక ఆయన హస్తం ఉన్నట్లు అబ్రహం వర్గీయులు గుర్రుగా ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, నాయకులు

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



ఉప్పర్‌పల్లిల్లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదాద్దరని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మక్తల్ మండలం మక్తల్, ఉప్పర్‌పల్లి, లింగంపల్లిలో ఎమ్మెల్యే చిట్టెం చేతుల మీద బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ కానుకగా బతుకమ్మ చీరలను మహిళలకు అందజేస్తున్నారని, కల్యాణలక్ష్మి, షాదీముబార్ పథకాలతో పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నారన్నారు. పార్టీలను సైతం పక్కన పెట్టి గ్రామాలకు నిధులు మంజూరు చేస్తున్నారని, నియోజకవర్గాన్ని సైతం అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. దాదాపు 10 వేలకుపైగా బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, కమిషనర్ బాల్‌రాం నాయక్, కౌన్సిలర్లు కౌసల్య, చీరాల సత్యనారాయణ, రాములు, ఎంపీటీసీ లత, ఎంపీడీఓ సద్గుణ, ఏపీఎం వనజ, సర్పంచులు సుజాత, శ్రావణి, దత్తుతోపాటు మహిపాల్‌రె పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

దామరగిద్ద: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి, వితలపూర్, మొగుల్‌మడ్క గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. లోకూర్తి గ్రామంలో రూ.2.8 కోట్ల నిధులతో నిర్మించిన 5 ఎంవీఏ సామర్థ్య గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అంతకుముందు లోకూర్తి మల్‌రెడ్డిపల్లి గ్రామ చెరువుల్లో ప్రభుత్వం సరఫరా చేసిన చేపపిల్లలను వదిలారు. వితలపూర్‌లో రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మొగుల్‌మడ్కలో మన ఊరు – మనబడి ద్వారా రూ.1.10 కోట్లతో చేపట్టనున్న పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.20 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.20 లక్షలతో హెల్త్‌సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.



లోకూర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

అంతకుముందు మల్‌రెడ్డిపల్లి, కాన్‌కుర్తి, వితలపూర్, సుద్దబండతాండా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఈదప్ప,జిల్లా సభ్యుడు వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్, ట్రాన్స్‌కో ఏఈ అనిల్, పీఆర్‌ఏఈ నర్సింగ్‌రావ్ పాల్గొన్నారు.

గీతాజయంతి భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గీతాజయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు విభాగాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. 6, 7 తరగతుల వారికి కర్మయోగం 1 నుంచి 30 శ్లోకాలు, 8, 9 తరగతులకు, 18 ఏళ్లలోపు 18 ఏళ్లపైబడిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చేనెల 2న గద్వాలలోని శ్రీసరస్వతి టాలెంట్ స్కూల్, 3న నారాయణపేట జిల్లా మరికల్‌లోని శ్రీభారతి హైస్కూల్, 8న వనపర్తి జిల్లా కొత్తకోటలోని పీపుల్స్ స్కూల్, 11న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, 19న మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో కంఠస్థ పోటీలు నిర్వహిస్తామన్నారు. నాలుగు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ధార్మిక కమిటీ కార్యకర్తలు లక్ష్మీనారాయణ, సురేష్ చంద్‌దూత్, రాములు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, తారకం, సూర్యనారాయణ, శేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐటీకి వన్నె తెచ్చిన మహనీయుడు రాజీవ్‌గాంధీ

నర్వ: దేశంలో ఐటీ విప్లవాన్ని తీసుకొచ్చిన మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని డీసీసీ అధ్యక్షులు వాకిటి శ్రీహరీ అన్నారు. గురువారం రాత్రి పెద్దకడ్మూర్‌లో నిర్వహించిన రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ, కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ ఫోరం రాష్ట్ర కమిటి సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరణతో పాటు కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు, నేటికీ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచాయన్నారు. ఆనాడు ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ అందించిన గొప్ప పథకాల కోసం రాష్ట్రంలో ఇటీవల సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు విదేశాలను వదిలి జన్మభూమికోసం వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఎన్‌ఆర్‌ఐ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నాగరాజుగౌడ్, గౌని బాలకృష్ణారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, గోపాల్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, లక్ష్మారెడ్డి, బల్‌రాంగౌడ్, చెన్నయ్యసాగర్ పాల్గొన్నారు.



పెద్దకడ్మూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

డిమాండ్ల సాధించేవరకు పోరాటం



నారాయణపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

నారాయణపేట రూరల్: న్యాయమైన సమస్యల సాధనకు చేపడుతున్న రిలే నిరసన దీక్షల్లో భాగంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నాకు తరలివెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరికి మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు వెంకట్రామారెడ్డి, బలరాం మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యులకు సమానంగా విధులు నిర్వహించారని, ప్రభుత్వం వారి సేవలను గుర్తించి కనీస వేతనం రూ.18వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా రూ.5లక్షల ప్రమాద భీమా అందిస్తూ ఇబ్బందికరమైన పనుల నుంచి దూరం పెట్టాలని కోరారు. కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంజయ్యగౌడ్, గోవిందరాజు, ఆంజనేయులు, కృష్ణయ్య, కాశప్ప, నరహరి, ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు శశికళ, అనురాధ, రాధిక, విజయలక్ష్మి, నాగమణి, అనంద, జ్యోతి, శాంతి, స్వాతి పాల్గొన్నారు.

అతివకు అండగా..

ఆర్థికాభివృద్ధి సాధించేలా 'సెర్ప్' ప్రత్యేక శిక్షణ

- రుణాలు అందజేస్తూ స్వయం ఉపాధికి తోడ్పాటు
- సెర్ప్ ఆధ్వర్యంలో 'విజన్ బిల్డింగ్' కార్యక్రమం
- జిల్లాలో నారాయణపేట, ఊట్కూర్, నర్వ మాగనూర్, కృష్ణ, మరికల్ మండల సమాఖ్యలు ఎన్నిక
- నూతన పంచవర్ష ప్రణాళికతో సంఘాల అభివృద్ధికి కృషి

నర్వ: గ్రామీణ ప్రాంతాల మహిళలు సంఘటితమయ్యేలా.. పొదుపుతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా.. స్వయం ఉపాధి రంగాల్లో రాణించేలా రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు మరిన్ని స్వయం సంఘాల ఏర్పాటును ప్రోత్సహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలోని పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో బాగంగా జిల్లా వ్యాప్తంగా మూడు మండలాలు ఎంపిక చేసుకున్న అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి మహిళ కుటుంబాన్ని ఆర్థికంగా ప్రగతి సాధించేందుకు అవసరమైన తోడ్పాటు అందించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం అనుమతి అనంతరం 'విజన్ బిల్డింగ్' పనులు ముమ్మరంగా చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా సరికొత్త లక్ష్యం నిర్దేశించుకొని సంఘాల ఏర్పాటును చేపట్టింది. మహిళా పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొంది చిరు వ్యాపారాలు, స్వయం సమృద్ధి పథకాలలో రుణాలు తీసుకొని లబ్ధిపొందేలా చర్యలు తీసుకోనుంది. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం ప్రతి జిల్లా నుంచి కొన్ని మండలాలను నమూనాగా ఎంపిక చేశారు. ఈ మేరకు ఇప్పటికే ఎంపిక చేసిన మండలాల ఏపీఎంలకు శిక్షణ పూర్తి చేశారు.



మగ్గం శిక్షణా శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మార్గదర్శకాల్లో పంచవర్ష ప్రణాళిక

నమూనా మండల సమాఖ్యలుగా ఎంపికైన పరిధిలోని గ్రామాలోని గ్రామైక్య పొదుపు సంఘాల వారు ప్రతి నెలా రుణ వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లించేలా చూడాలి. తప్పనిసరిగా సమావేశాలు, రుణంతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా, ప్రస్తుతం ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా అవసరమైన సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా తీర్చిదిద్దుతారు. రుణాలు అవసరమైతే బ్యాంకులు, స్త్రీనిధి నుంచి ఇప్పిస్తారు. ప్రతి స్వయం సహాయక సంఘం సభ్యురాలు విజన్ మిషన్ అబ్జెక్టివ్ స్ట్రాటజీ యాక్షన్ ప్లాన్‌నకు తగ్గట్టుగా లక్ష్యాలను ఏర్పరుచుకోని, దానిని ఏటా కొంత వరకు సాధించేలా పంచవర్ష ప్రణాళికలు తయారు చేస్తారు. రానున్న ఐదేళ్లల్లో ఈ లక్ష్యాలను చేరేలా చూసి, మహిళా సమాఖ్యలను ఆదర్శంగా మారుస్తారు.

జిల్లాలో ఇలా ..

జిల్లాలో విజన్ బిల్డింగ్ కార్యక్రమం కోసం మొదటి విడతలో మూడు మండలాలను, రెండో విడతలో మరో మూడు మండలాలను ఎంపిక చేశారు. ఇందులో నారాయణపేట, ఊట్కూర్, నర్వ మండలాలు మొదటి విడుతలో ఉండగా రెండో విడతలో మరో మూడు మండలాలు మాగనూర్, కృష్ణ, మరికల్‌లున్నాయి. ప్రతి ఏటా రూ.వందల కోట్లు రుణాలు అందిస్తున్నప్పటికీ, వ్యాపారాల ఏర్పాటుకు వారి ఆర్థికాభివృద్ధికి ఉపయోగిస్తున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర వ్యాప్తంగా తొలివిడతగా 102 మండల సమాఖ్యలను ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో 16 మండలాలుండగా నారాయణపేట జిల్లాలో ఆరు మండలాలను ఎంపిక చేశారు.

ప్రధాన లక్ష్యాలివి..

- మహిళా సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి సుస్థిర జీవనోపాధితో ఆదాయం వచ్చేలా చర్యలు చేపడతారు. దీనికోసం బ్యాంకు రుణాలు, స్త్రీనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తారు.
- వ్యవసాయం, పశుపోషణ ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు వృత్తినైపుణ్యం పెంపొదించడం, కుటిర పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తారు. నెలకు కనీసం రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఆదాయం సమకూరేలా చేస్తారు.
- సంఘాల బలోపేతానికి ఆర్థిక సహకారం అందిస్తారు. ఆన్‌లైన్ విధానంలో లావాదేవీలు, యాప్‌ల ద్వారా రికార్డుల నిర్వాహణ చేసేలా వారికి అవగాహన కల్పిస్తారు. సభ్యులందరికి బీమా, ఆర్థిక అక్షరాస్యత కల్పించనున్నారు.

జిల్లా వివరాలిలా..

మొత్తం మహిళా సంఘాలు	జిల్లాలో ఎంపికైన మండల సమాఖ్యలు
8,067	3

మహిళా సభ్యులు 91,065

జిల్లాలోని సంఘాలు, సభ్యుల వివరాలిలా..

మండలం	సంఘాలు	సభ్యులు
మద్దూర్	1,243	14,078
దామరగిద్ద	1076	11,628
నారాయణపేట	969	11,287
మక్తల్	795	9,223
ఊట్కూర్	799	9,093
కోస్గి	693	7,679
మరికల్	610	6,855
ధన్వాడ	593	6,678
నర్వ	541	6,217
మాగనూర్	397	4,445
క్రిష్ణా	351	3,882

సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సమాఖ్యల్లోని సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో రాణించేందుకు విజన్ బిల్డింగ్ అనే కొత్త కార్యక్రమానికి సెర్ప్ శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు జిల్లాలో మూడు మండల సమాఖ్యలను ఎంపిక చేసి మండల ఏపీఎంలకు శిక్షణ ఇచ్చారు. పేదరిక నిర్మూలన కోసం విజన్ డాక్యుమెంట్‌ను ఐదేళ్ళ కోసం తయారు చేశాం. త్వరలో ఈ కార్యక్రమం అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధి విధానాలను రూపొందించనున్నారు.

– అంజయ్య, ఏపీడీ

క్లుప్తంగా

రోకలిబండతో మోది మహిళ హత్య

హన్వాడ: మండలంలోని నాయినోనిపల్లిలో వివాహితను వియ్యంకుడే హతమార్చిన ఘటన గురువారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములమ్మ(53)ను తన వియ్యంకుడైన నర్సింహులు బుధవారం అర్ధ రాత్రి హతమార్చాడు. నర్సింహులు తన కూతురు రాములమ్మ కొడుక్కి ఇచ్చి వివాహం చేశారు. ఇరువురు ఇళ్లు పక్కపక్కనే ఉండడంతో నర్సింహులు తరుచూ రాములమ్మతో తగువులాడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పథకం ప్రకారం రోకలిబండతో నిద్రిస్తున్న రాములమ్మ తలపై బలంగా మోదడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఇంటి పక్కనే మరో ఇంట్లో నిద్రిస్తున్న రాములమ్మ కుమారులు ఉదయం హత్యకు గురైన రాములమ్మను ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పెద్దకుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవినాయక్ పేర్కొన్నారు.

పొలంలోనే ప్రాణం వదిలిన రైతు

ఎర్రవల్లిచౌరస్తా: వ్యవసాయ పొలంలో గుండెపోటుకు గురై యువ రైతు మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలంలోని కోదండాపురంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (29) బుధవారం రాత్రి 9 గంటలకు మిరప పంటకు నీరు పెట్టడం కోసం పొలానికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కూలిపోయి అపస్మారక స్థితిలో మిరపపంటకు పెట్టిన నీటిలోనే పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య జయంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చింతకాయల కోసం వెళ్లి వ్యక్తి మృతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని బుద్ధసముద్రం చెందిన నూకల ఆంజనేయులు(48) బుధవారం మధ్యాహ్నం తర్వాత చింతకాయల కోసం ఇంటి నుంచి వెళ్లి, గురువారం సాయంత్రం శవమై కన్పించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంజనేయులు ఇంట్లోకి చింతకాయల కోసం ఊర్లోకి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోయే సరికి గ్రామంలో, బంధువుల ఇళ్ల వద్ద విచారించి, గురువారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో అతని కుమారుడు శివశంకర్ ఫిర్యాదు చేశాడు. గురువారం సాయంత్రానికి గ్రామంలోని ఒక బావి వద్ద ఆంజనేయులు చెప్పులు, చేతి రుమాలు స్థానికులకు కన్పించాయి. వారు బావిలోకి చూడగ ఆంజనేయులు మృతదేహం కన్పించడంతో కుటుంబ సభ్యులకు తెలిపారు. చింతకాయల కోసం బావిలో ఉన్న చింత చెట్టు ఎక్కడంతో కొమ్మ విరిగి చనిపోయి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకరయ్య తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


కుర్మన్న (ఫైల్)

చిన్నచింతకుంట: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడూర్ చెందిన హరిజన్ కుర్మన్న (48) గత నెల 28న రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను వెంటనే కుటుంబ సభ్యులు ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లాడరు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి బావమరిది శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ఉండవెల్లి: భర్త, అతని కుటుంబసభ్యులు వేధిస్తున్నారని వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. కర్నూల్ పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన వడ్డేరేణుకకు మండల కేంద్రానికి చెందిన సురేష్ ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి వారు కర్నూల్‌లో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులు దంపతులు ఇద్దరు బాగానే ఉన్నా.. మార్చి నెల నుంచి భర్త, అతని అక్క రాధమ్మ, బావ వెంకటేశ్వర్లు లేనిపోని నిందలు వేసి తరుచూ మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారని గురువారం వడ్డే రేణుక ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సురేష్, రాధమ్మ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

ఉద్యోగం కల.. నెరవేరిన వేళ




పీయూలోని స్టడీ సర్కిల్‌లో తరగతులకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

పీయూలో 32 మంది విద్యార్థులకు కానిస్టేబుల్ ఉద్యోగాలు

- ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లోనే 12 మందికి..
- మూడు దశల్లో స్టడీ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చిన పీయూ అధికారులు
- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలోనూ 11 మంది అభ్యర్థులకు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. ఇందులో ప్రముఖంగా పాలమూరు యూనివర్సిటీలో మొత్తం 32 మంది కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా, ఒక్క ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లోనే 12 మంది ఎంపికై న వారిలో ఉండడంతో అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం సాధించడంలో పీయూ వీసీ ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు స్టడీ సెంటర్ అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల కాక ముందే స్టడీ సెంటర్ ద్వారా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇది మూడు దశల్లో జరిగింది. పలు సబ్జెక్టులు బోధించేందుకు ప్రైవేటు కోచింగ్ సెంటర్ల నుంచి అధ్యాపకులను రప్పించి శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు గ్రౌండ్‌లో ఈవెంట్స్‌కు సంబంధించిన శిక్షణ అభ్యర్థులు తీసుకున్నారు. వీటితో పాటు అక్కడే హాస్టల్ ఉండడం, లైబ్రరీలో పుస్తకాలు అందుబాటులో ఉండడం వంటి చర్యల కారణంగా ఉద్యోగాలు సాధించినట్లు అభ్యర్థులు తెలుపుతున్నారు. ఇక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 11 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు.

కుటుంబ బాధ్యతలు మోస్తూ..



వివాహం తర్వాత, ఇద్దరు పిల్లలు, కుటుంబ బాధ్యతల నేపథ్యంలో పీయూలో పాలిటిక్స్ పీజీ చేస్తూ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమయ్యా. ఈ క్రమంలో పీయూలో కోచింగ్ తీసుకున్నాం. సివిల్ ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు కుటుంబ సభ్యులు, పీయూలో సార్ వాళ్లు ఎంతో సహకరించారు. – స్వప్నరెడ్డి, సివిల్ కానిస్టేబుల్, పీయూ, పొలిటికల్ సైన్స్

సరైన సమయంలో కోచింగ్..



ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చే క్రమంలో పీయూలో సార్ వాళ్లు కోచింగ్ పలు దశల్లో ఇవ్వడం వల్ల ప్రిపరేషన్‌కు ఎంతో ప్రయోజనకరం అయ్యింది. గ్రౌండ్ ఈవెంట్స్ ఎంపికల కోసం కూడా సార్ వాళ్లు చర్యలు తీసుకోవడంతో సులువుగా ఎంపిక జరిగింది. ఇన్ని రోజుల నిరీక్షణలో లక్ష్యాన్ని చేరుకోవడం సంతోషంగా ఉంది. – సంగీత, సివిల్, పీయూ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ

క్యాంపస్ అనుకూలం..



బయట శిక్షణ ఇతర సదుపాయాలు, ఖర్చులతో అభ్యర్థులకు భారంగా మారే పరస్థితి. కానీ క్యాంపస్‌లో సీటు వచ్చాక వాటికి సంబంధించి ఇబ్బంది లేకుండా పోయింది. ఉచిత శిక్షణ, లైబ్రరీలో పుస్తకాలు, మెటీరియల్స్ వంటి సదుపాయాలతో ఖర్చులు తగ్గాయి. డబ్బులకు టెన్షన్ లేకుండా ప్రిపరేషన్ సాగించాం. – వెంకట్రాములు, టీఎస్ఎస్‌పీ, పీయూ పొలిటికల్‌సైన్స్

అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం



పీయూ విద్యార్థులకు తమ చదువులు కొనసాగిస్తూ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకముందే శిక్షణ ఇచ్చిన మొదటి యూనివర్సిటీ పీయూ. ఈవెంట్స్ కూడా మెళకువలు నేర్పించాం. ఎస్ఐ, గ్రూప్స్‌కు కూడా శిక్షణ ఇచ్చాం. ఉద్యోగాలు సాధించడం జిల్లాకే గర్వకారణం. – లక్ష్మీకాంత్‌రాథోడ్, వైస్ ఛాన్స్‌లర్, పీయూ

సార్ వాళ్లు సహకరించారు



నోటిఫికేషన్ వచ్చాక ప్రిపరేషన్ ప్రారంభించాం. యూనివర్సిటీలో సార్ వాళ్లు ఎంతో సహకరించారు. ఇక్కడ శిక్షణ తీసుకోవడంతో పాటు ఖాళీ సమయాల్లో సొంతంగా ప్రిపరేషన్ అయ్యాం. దీంతో ప్రణాళికబద్ధంగా చదవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాం. స్నేహితులు, కుటుంబ సభ్యుల సహకారం ఉంది. – సౌజన్య, సివిల్ కానిస్టేబుల్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, పీయూ

కోచింగ్‌తో ప్రయోజనం..



పీయూలో సీటు వచ్చాక ఉద్యోగ సాధన కోసం ప్రిపరేషన్ సాగించా. ముఖ్యంగా ఇక్కడ ఇచ్చిన శిక్షణతో ఎంతో ప్రయోజనం చేకూరింది. సమయం ప్రకారం తరగతులు, ప్రిపరేషన్ చేస్తూ ఇక్కడే ఉండడం వల్ల సమయం కలిసి వస్తుంది. ఉద్యోగ సాధన ఎంతో కృషి చేశాం. తల్లిదండ్రుల కల నెరవేరింది. –అంజప్ప, టీఎస్ఎస్పీ, పీయూ ఎంఎస్‌డబ్ల్యూ

వసతులతో ప్రయోజనం..



యూనివర్సిటీలో చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం ఉండడం వల్ల ప్రిపరేషన్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగింది. కోచింగ్‌తో పాటు ఇతర లైబ్రరీ, స్టడీ హాల్ తదితర సదుపాయాలు వినియోగించుకున్నాం. ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. – పూజిత, ఏఆర్ కానిస్టేబుల్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, పీయూ

ఈజీ మనీ కోసం చోరీలు


నిందితులు, ఆభరణాలను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహా

- 33 కేసులలో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నర్సింహా

జడ్చర్ల: చిన్నతనం నుంచి సులభంగా డబ్బు సంపాదనపై దృష్టి సారించి ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో అనేక చోరీలు, దోపిడీలు, హత్య, కిడ్నాప్, ఇతర 33 కేసులలో నిందితుడు, అతనికి సహకరిస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ నర్సింహ వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జీడిపల్లికి చెందిన బాషమోని సైదులు, జడ్చర్ల వెంకటేశ్వర కాలనీకి చెందిన కొంగలి అంజలితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని చోరీలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో స్థానిక పంచముఖికాలనీలో నివాసం ఉంటున్న రవికుమార్‌గౌడ్ ఈఏడాది జూన్ 2న శుభకార్యం నిమిత్తం అత్తగారి ఊరైన బూరెడ్డిపల్లికి ఇంటికి తాళం వేసి కుటుంబంతో వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉంది. ఇంటిలోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచి ఉంచిన 8.50 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం స్థానిక నిమ్మబావిగడ్డ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులకు నేరస్తులు సైదులు, అంజలితో కలిసి బైక్‌పై నాగర్‌కర్నూల్ వైపు నుంచి జడ్చర్లకు దొంగతనం చేసిన బంగారు ఆభరణాలను అమ్మేందుకు వస్తున్నారు. ఈ సమయంలో పోలీసులను గమనించిన వారు తప్పించుకుని పారిపోతుండగా అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా నిజాలు బయటకు వచ్చాయి. నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్న అద్దె ఇంటిలో దాచి ఉంచి బంగారు నగలతో పాటు దొంగతనం చేసిన నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అంతేగాక మరికొన్ని నగలు కర్ణాటక రాష్ట్రంలోని సైదాపూర్‌లో గల తన అద్దె ఇంట్లో నిల్వ ఉన్నట్లు గుర్తించారు. త్వరలోనే వాటిని స్వాధీన పర్చుకుంటామని, నిందితులను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని మరోసారి విచారిస్తామన్నారు.

చిన్నప్పటి నుంచే..

సైదులు చిన్నప్పటి నుంచే దొంగతనాలు, నేరాలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఇతర జిల్లాల్లో పలు దొంగతనాలలో నిందితుడుగా ఉన్నాడని చెప్పారు. తన భార్యను హత్య చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని, తదుపరి జడ్చర్లకు చెందిన అంజలితో కలిసి తమ్ముడి కూతురును డబ్బుల కోసం కిడ్నాప్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాపను విడిచి వెళ్లారు. అనంతరం కర్ణాటక రాష్ట్రం సైదాపూర్‌కు వెళ్లి అక్కడ ఉంటూ దొంగతనాలను కొనసాగించారు. దొంగతనాలకు ముందు ఆ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. నిలిపిన బైక్‌లను కూడా అపహరిస్తారని తెలిపారు. నేరస్తులు పాత కేసులు 12 ఉండగా మరో 21 కేసులు కొత్తగా నమోదయ్యాయని తెలిపారు. ఇన్నాళ్లు తప్పించుకుని తిరుగుతున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ప్రశంసిస్తూ రివార్డులను అందజేశారు. సమావేశంలో డీఎస్పీ మహేష్, ఎస్ఐలు చంద్రమోహన్, నాగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఒక్క మార్కు

- కానిస్టేబుల్ ఉద్యోగం రాలేదని ఉరేసుకుని ఇద్దరి ఆత్మహత్య
- ధరూర్, హన్వాడలో విషాదఛాయలు

కానిస్టేబుల్ ఉద్యోగం రాలేదని ఇద్దరు అభ్యర్థులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గురువారం చోటు చేసుకుంది.

ధరూరు: ప్రభుత్వ ఉద్యోగంపై ఆశలు పెట్టుకున్న ఆ విద్యార్థి ఒక మార్కు తక్కువ రావడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కురువ గడ్డమీది పెద్ద నర్సింహులు, దౌలమ్మ దంపతులకు నలుగురు సంతాం. ముగ్గురు ఆడ పిల్లలు, కుమారుడు. వారిలో కూతుర్లకు పెళ్లిళ్లు కాగా, మూడో వాడైన దేవార్జున్(25) చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. బుధవారం వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో తన పేరు రాకపోవడంతో ఆన్‌లైన్‌లో మార్కులు చూసుకున్నాడు. 128 మార్కులు కటాఫ్‌గా పెట్టడంతో దేవార్జున్‌కు 127 వచ్చాయి. ఒక్క మార్కు మాత్రమే తక్కువ రావడంతో మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో ఉరేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు కళ్ల ముందే శవమై కనిపించడంతో తల్లిదండ్రులు, అక్కా, చెల్లెళ్ల రోదనలు మిన్నంటాయి.


దేవార్జున్ (ఫైల్)


రమేష్(ఫైల్)

హన్వాడలో మరో యువకుడు..

హన్వాడ: మండలంలోని శేక్‌పల్లి గ్రామం లష్కర్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రావత్ రమేష్(27) ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో 117 మార్కులు రాగా ఎంపిక కాలేదు. దీంతో మనస్తాపం చెంది తమ పొలం దగ్గరకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన 8నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగం కోసం శిక్షణ పొందిన, ఇటీవలే ఇంటికి వచ్చాడు. చంద్రనాయక్, ధర్మిబాయి దంపతులకు ముగ్గురు సంతానంలో ఈయన రెండోవాడు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రాష్ట్ర నిధులతోనే మన్యంకొండలో రోప్ వే

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలో రోప్ వేతో పాటు అన్నదాన సత్రం, పార్కు, కల్యాణ కట్ట ఇతర పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రసాద్ పథకం కింద ప్రతిపాదనలు పంపిచామని, కానీ అనుమతి రాకపోవడం కారణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర నిధుల నుంచి రూ. 50కోట్లు మంజూరు చేసి తక్షణమే రోప్ వే పనులను చేపట్టాలని ఆదేశించినట్లు ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కొండపైకి వెళ్లేందుకు చేపట్టనున్న రోప్ వే పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ మన్యంకొండలో అంతర్జాతీయ స్థాయిలో రోప్ వేను నిర్మిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి అని, పొడవైన రోప్ వే కూడా ఇదే నిలుస్తుందని తెలిపారు. దీంతో పాటు అన్నదాన సత్రం, క్లాక్ రూమ్స్, ప్రసాదం కౌంటర్లు, కల్యాణకట్ట తదితర నిర్మాణాలను చేపట్టినట్లు వెల్లడించారు. వచ్చే సంవత్సరం నాటికి రోప్ వే పూర్తవుతుందని, దీని ద్వారా కొండపైకి కాలినడకన వెళ్లలేని వృద్ధులు, పిల్లలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇక్కడే బడ్జెట్ హోటల్, ఇతర నిర్మాణాలను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పర్యాటకశాఖ ఎండీ మనోహర్, రోప్ వే నిర్మాణ సంస్థ డైరెక్టర్ రచన ముఖర్జీ, సీఈ వెంకటరమణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఇరువర్గాల రగడ



జేసీబీతో కట్టడాలను తొలగిస్తున్న రైతులు

- రైతులంతా కలిసి తొలగించే యత్నం
- గుంపులను చెదరగొట్టిన పోలీసులు

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా నుంచి పారుచర్ల మీదుగా పెద్దచింతరేవుల వరకు వెళ్లే రోడ్డును నిర్మాణదారులు ఇరు వైపులా ఆక్రమించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని తొలగించారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. దశాబ్ద కాలంగా ఈ పంచాయితీ కొనసాగుతుండగా.. కొలిక్కి రాలేదు. చేసేదేమి లేక దాదాపు 200 మంది రైతులు జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించేందుకు గురువారం పూనుకున్నారు. బూరెడ్డిపల్లికి చెందిన బండ్ల పుల్లారెడ్డి తన కాంప్లెక్స్ నిర్మాణ సమయంలో ఆక్రమించారని రైతులు ఆరోపించారు. అది కాకుండా ఇటీవల ట్రాక్టర్‌తో మట్టి వేశారు. గమనించిన రైతులు ఆగ్రహించి గురువారం పంచాయతీ కార్యదర్శితో కలిసి జేసీబీతో ఆక్రమించిన ప్రాంతాన్ని తొలగించేందుకు వచ్చారు. ఈ క్రమంలో పుల్లారెడ్డి అతని తమ్ముడు విజయ్‌రెడ్డి, సాగర్‌రెడ్డి అడ్డుకోబోయారు. వారిని రైతులు తరిమికొట్టారు. దీంతో బైపాస్ రోడ్డులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న రేవులపల్లి పోలీసులు ఎస్ఐ శివానందంగౌడ్ చేరుకుని జనాలను చెదరగొట్టారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి సాయంత్రం వరకు దగ్గరుండి ఇరు వైపులా కట్టడాలు కాకుండా కేవలం తాత్కాలిక ఆక్రమణలను తొలగించారు. గతంలో పెద్దలు ధరూరు మీదుగా పారుచర్ల వయా పెద్ద చింతరేవుల వరకు వెళ్లే వారని అలాంటిది ఎద్దుల బండి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఎదురు కావడానికి ఆక్రమణల కారణమని ఆ ప్రాంతం వైపు వెళ్లే రైతులు తెలిపారు. ఏది ఏమైనా కేవలం తాత్కాలిక వారసత్రాలు, మట్టి కుప్పలు, రాళ్ల కుప్పలు, కట్టెలనే తొలగించారు. మరోమారు సర్వే చేయించి అక్రమ కట్టడాలను కూడా కూల్చివేస్తామని రైతులు చెబుతున్నారు.

వివాహిత ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఎర్రవల్లిచౌరస్తా: కుటుంబ తగాదాలతో వివాహిత జీవితంపై విరక్తి చెంది గురువారం తన కుమారుడితో కలిసి కృష్ణానదిలో దూకేందుకు ప్రయత్నించగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు కాపాడారు. ఎస్ఐ అశోక్ బాబు తెలిపిన వివరాలు ఇలా.. అయిజకు చెందిన మహిళ నిత్యం కుటుంబంలో తగాదాలు అవుతుండడంతో జీవితంపై విరక్తి చెంది తన కుమారుడిని వెంట తీసుకుని బీచుపల్లికి వచ్చి కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇటిక్యాల పోలీసులు గమనించి ఇద్దరి పట్టుకున్నారు. అనంతరం పూర్తి వివరాలను తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

బీచుపల్లిని సందర్శించిన ఉడిపి పీఠాధిపతులు


వేద పాఠశాల కోసం స్థలం పరిశీలిస్తున్న పీఠాధిపతులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని గురువారం ఉడిపి పల్మేర్ మఠానికి చెందిన పీఠాధిపతులు విద్యాదేశా తీర్థాలు, విద్యారాజేశ్వర తీర్థాలు సందర్శించారు. కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి ఆంజనేయ స్వామిని, కలీం మహర్షిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ధర్మకర్త భరతసింహారెడ్డితో కలిసి వేద పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. నది సమీపంలో ఉన్న స్థలం అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈఓ రామన్‌గౌడ్, అర్చకులు మారుతిచారి, సందీప్‌చారి, మఠం సిబ్బంది ఉన్నారు.

ముగ్గురి రిమాండ్

మిడ్జిల్: మండలంలో బాలికను వేధించిన కేసులో ముగ్గురు బాలురను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

జూరాలలో 9.2టీఎంసీల నీరు నిల్వ

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆవిరి రూపంలో 94, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్ సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు –2కు 750 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.214 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 856 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 865 అడుగుల వద్ద 94.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా వెయ్యి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,270 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 3.127 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 6,016 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 140 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

అడవులు, వన్యప్రాణులను రక్షించాలి


బహుమతులు అందిస్తున్న పీసీసీఎఫ్ జైశ్వాల్

మన్ననూర్: ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి పీసీసీఎఫ్ లోకేష్ జైశ్వాల్ బహుమతులు ప్రదానం చేశారు. గురువారం మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలోని వనమాళికా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మన్ననూర్, అమ్రాబాద్, పదర ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన వారికి బ్యాగులు, ప్రశంసాపత్రాలను ఇచ్చారు. అచ్చంపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో అటవీశాఖ అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్, తగ్‌ఆఫ్‌వార్ ఇతర ఆటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పీసీసీఎఫ్ మాట్లాడుతూ అడవులు, వన్య ప్రాణుల అభివృద్ధికి అందరూ భాగస్వాములు అయ్యేలా ప్రజలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏటీఆర్ ఎఫ్‌డీ క్షితిజ, పద్మారాణి, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్ఆర్ఓలు ప్రభాకర్, ఈశ్వర్, ఆదిత్య, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.